నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 23 మార్చి 2025 | KAMAREDDY

# రైతు శ్రమ నేలపాలు..

రామారెడ్డి/భిక్కనూరు/రాజంపేట, మార్చి 22: అకాల వర్షాలతో కామారెడ్డి జిల్లాలోనూ పంట నష్టం వాటిల్లింది. రాజంపేట్, భిక్కనూరు, సదాశివనగర్ తదితర మండలాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. రాజంపేట మండలంలో మక్కజొన్న పంట నేలవాలింది. తలమడ్ల, ఆరెపల్లి, ఆర్గొండ, బస్వన్నపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 26 ఎకరాల్లో నష్టం జరిగిందని ఏవో శ్రుతి తెలిపారు. కోసి ఆరబెట్టిన కంకులు తడిసిపోయాయని, మొలకలు వచ్చే అవకాశముందని రైతులు వాపోయారు. మరోవైపు, ఇంకా వర్షా లు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ ప్రకటనలతో భయాందోళనకు గురవుతున్నారు. భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లిలో సుభాన్‌రెడ్డి మూడెకరాల్లో సాగుచేస్తున్న బొప్పాయి తోటకి నష్టం వాటిల్లింది. 100కు పైగా బొప్పాయి చెట్లు నేలకొరిగాయని, రూ.లక్ష దాకా నష్టపోయాయని రైతు వాపోయాడు. అంతపల్లిలో దెబ్బతిన్న మక్కజొన్న పంటలను డీఏవో తిరుమల ప్రసాద్ పరిశీలించారు. పంట నష్టం వివరాలు సేకరించి నివేదించాలని అధికారులను ఆదేశించారు. సదాశివనగర్ మండలంలో భారీ వర్షం కురియడంతో మక్కజొన్న నేలకొరిగింది. సదాశినగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, మర్కల్, ధర్మరావుపేట్, కుప్రియాల్ తదితర గ్రామాల్లో 42 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఏవో ప్రజాప్రతి తెలిపారు. అయితే, క్షేత్ర స్థాయిలో అంతకు రెట్టింపు స్థాయిలో నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు.


సదాశివనగర్‌లో వడగండ్ల వానకు దెబ్బతిన్న మక్కజొన్న


లక్ష్మీదేవునిపల్లిలో అకాల వర్షానికి నేలకొరిగిన బొప్పాయి తోట


నిజామాబాద్ రూరల్ మండలం పాల్దాలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పైరు

# అన్నదాతకు 'అకాల' కష్టం

## పంట నష్టంపై స్పష్టత కరువు

- వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు
- చాలా చోట్ల నేలరాలిన ధాన్యం
- కోత దశలో తీరని నష్టాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి
- అరకొరగానే సాగుతున్న పంట నష్టం వివరాల సేకరణ

నిజామాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంటలు దెబ్బ తిన్నాయి. వారం, పది రోజుల్లో కోతకొచ్చే పైర్లు నేలవాలాయి. మక్కజొన్నతో పాటు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాగునీటి కష్టాలను అధిగమించి పంటలను కాపాడుకున్న రైతులను అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బ కొట్టాయి. చేతికొచ్చిన పంట ఎటూ కాకుండా పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, పంట నష్టం అంచనాల సేకరణ అంతంత మాత్రంగానే కొనసాగుతుండడం, ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం ఓదార్చేందుకు రాకపోవడంతో కర్షకులు మరింత కుంగిపోతున్నారు. రానున్న రోజుల్లోనూ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ ప్రకటనలతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా పంట కోసే సమయంలో వర్ష సూచన రావడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు.

### మొక్కుబడిగా వివరాల సేకరణ..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్ని మండలాల్లో పంట నష్ట తీవ్రత ఎక్కువగా ఉన్నది. నిజామాబాద్ జిల్లాలో బోధన్, రూరల్ నియోజకవర్గాల్లో వడగండ్లు, ఈదురుగాలులతో పంటలకు నష్టం జరిగింది. బలమైన గాలులకు ధాన్యం గింజలు నేలరాలాయి. నిన్నా మొన్నటి వరకూ సాగునీటి కష్టాలను తట్టుకుని పంటలను కాపాడుకున్న రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ధాన్యం అమ్ముకుని నష్టాల నుంచి బయట పడుతామనుకునే లోపే అకాల వర్షం ఊహించని రీతిలో దెబ్బ కొట్టింది. బోధన్, కోటగిరి, పోతంగల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో పంట నష్టం సంభవించింది. పంట నష్టంపై ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. గురు, శుక్రవారాల్లో పడిన వర్షాలతో జరిగిన నష్టం అంచనాలు ఇంకా సిద్ధం చేయలేదు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో మొక్కుబడిగా తిరుగుతూ నష్టం అంచనాలు సేకరించే పనిలో పడ్డారు. అధికారికంగా వివరాలు వెల్లడించకపోగా, రైతులను ఓదార్చేవారు కరువయ్యారు. మరోవైపు చేతికొచ్చిన పంటను కోసి అమ్ముకుందామంటే ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు సిద్ధంగా లేవు. అధికారికంగా ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెబుతున్నారు.


వాడిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఈ ప్రదీప్‌కుమార్

### ధాన్యం నేలపాలు..

ధర్పల్లి/సారంగపూర్, మార్చి 22: రెండ్రోజుల క్రితం కురిసిన వడగండ్లతో ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధర్పల్లి మండలంలోని వాడి, మద్దుల్ తండాలో వడగండ్లు పడి ధాన్యం గింజలు పూర్తిగా రాలిపోయాయి. హోన్నాజీపేట్ గ్రామశివారులోనూ పంటలు దెబ్బ తిన్నాయి. సారంగపూర్ మండలం పాల్దలోనూ వరి పైర్లు నేలకొరిగాయి. నిన్న, మొన్నటిదాకా చివరి తడికి నీరందక రైతులు సగం పంటను వదిలేశారు. మిగిలిన సగం పంటను వాటర్ ట్యాంకుల ద్వారా నీరందిస్తూ కాపాడుకున్నారు. పంట కోసే సమయానికి వడగండ్లు పడి ధాన్యం నేలరాలడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

**రెండు గ్రామాల్లోనే 265 ఎకరాల్లో నష్టం**

అకాల వర్షం రైతులను తీవ్రంగానే దెబ్బకొట్టింది. వాడి, దమ్మన్నపేట్ గ్రామాల్లోనే 174 మంది రైతులకు చెందిన 265 ఎకరాల వరి పంట దెబ్బ తిన్నాయి. వాడి, మద్దుల్ తండా, సీతాయిపేట్, హోన్నాజీపేట్ తదితర ప్రాంతాల్లో దెబ్బ తిన్న వరి పంటలను రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో వెంకటేశ్ పరిశీలించారు. పెట్టుబడి ఖర్చు కూడా మిగలకుండా పోయిందని, తమను ఆదుకోవాలని రైతులు వ్యవసాయాధికారులకు మొరపెట్టుకున్నారు. పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు.


ధర్పల్లి మండలం వాడి– సీతాయిపేట్ శివారులో గల పొలంలో నేలరాలిన ధాన్యం

### కొనుగోళ్లు ఎప్పుడో..?

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన వరి పంట కోత దశకు చేరింది. ఇప్పటికే బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. అయితే, ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. నిజామాబాద్ జిల్లాలో గతంలో మాదిరిగానే ఈసారి కూడా వరి అత్యధికంగా సాగైంది. 4.20 లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 45,993 హెక్టార్లలో దొడ్డు రకం, 23,868 హెక్టార్లలో సన్న రకం ధాన్యాన్ని సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. దొడ్డు, సన్న రకాలు కలిపి మొత్తంగా 11,82,783 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 2,85,783 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు తమ అవసరాల కోసం నిల్వ చేసుకోగా, దాదాపుగా 9 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. దిగుబడి అంచనాల ఆధారంగా ఈసారి నిజామాబాద్ జిల్లాలో 664 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

### పరిహారం కోసం..

అకాల వర్షం, వడగండ్లతో పంటలు దెబ్బ తినగా, వ్యవసాయ శాఖ ఇంకా నివేదికల రూపకల్పనలోనే నిమగ్నమైంది. వివరాలు మాత్రం వెల్లడించలేదు. పంట నష్టపోయిన రైతులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎన్నో కష్టాలకోర్చి, సాగు నీటి ఇక్కట్లు అధిగమించి పండించిన పంట చివర్లో అనుకోని వానలతో దెబ్బ తినడంతో వారు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు, నీళ్లు లేక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి ఎంతో మంది రైతులు ఇప్పటికే నష్టాలను మూటగట్టుకున్నారు. కాంగ్రెస్ పాలనలో సరిగా నీళ్లు అందక పెట్టుబడి డబ్బులు కూడా కోల్పోయిన తమను కూడా ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు. పరిహారాన్ని తమకు కూడా వర్తింపజేయాలని పంట ఎండిపోయిన రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరిమితికి మించి.. డీసీఎంలో కుక్కి..

**పరీక్ష రాసే** గురుకుల విద్యార్థులకు ఎగ్జామ్ సెంటర్ల వరకు రవాణా సదుపాయం కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. కానీ ఒకే వాహనంలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ వారిని తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు చెందిన 78 మంది పదో తరగతి విద్యార్థులకు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిర్జాపూర్ గ్రామంలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో అధికారులు విద్యార్థులను ఒకే డీసీఎం వాహనంలో కుక్కి పరీక్షా కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో చందర్‌ను సంప్రదించగా ట్రాన్స్‌పోర్టేషన్ తన దృష్టికి రాలేదని తెలిపారు.

–నస్రుల్లాబాద్, మార్చి 22



# బాన్సువాడకు రేపు ఎమ్మెల్సీ కవిత రాక



బాన్సువాడ, మార్చి 22: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 24న బాన్సువాడకు రానున్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందులో పాల్గొంటారని పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పెద్ద మసీదు ఎదురుగా ఉన్న బక్రాన్ బీడీ కాంప్లెక్సులో సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ విందు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముస్లింలు హాజరుకావాలని ఆయన కోరారు.

# రాత్రుళ్లు ఇసుక తవ్వితే జరిమానా!

- బట్టాపూర్‌లో రూ.3.50 లక్షలు జరిమానా విధించిన వీడీసీ
- వెల్కటూర్‌లోనూ ట్రాక్టర్‌కు రూ.50వేలు వసూలు
- బాల్కొండ నియోజకవర్గంలో ఆగని ఇసుక దందా

మోర్తాడ్, మార్చి 22: బాల్కొండ నియోజకవర్గంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతున్నది. అధికారపార్టీ నాయకులే ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతుండడం అందుకు అధికారులు వత్తాసు పలుకుతుండడం పరిపాటిగా మారింది. భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల, మెండోరా మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాపై నమస్తే తెలంగాణ దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో అక్రమార్కులు రూటు మార్చుకున్నారు. వేబిల్లుల పేరిట అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఏర్గట్ల మండలం బట్టాపూర్ శివారులో ఇసుక తవ్వకాల కోసం ట్రాక్టర్‌కు రూ.50వేలు గ్రామ కమిటీకి చెల్లించాల్సిందే.అయితే ఉదయం 6 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే తవ్వకాలు చేపట్టాలనే ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కొందరు ఒప్పందానికి విరుద్ధంగా సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీంతో గ్రామకమిటీ శనివారం సమావేశమై ఇసుకను తరలించిన వారికి రూ.3.50లక్షల జరిమానా విధించినట్లు తెలిసింది. ఇసుకను తీసుకెళ్లాలనుకుంటే వీడీసీకి తప్పనిసరిగా డబ్బులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. గాండ్లపేట్ పెద్దవాగులోనూ ఇలాగే జరిగింది. గాండ్లపేట్ పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి మోర్తాడ్ శివారులోని వాగులోకి వెళ్లడంతో మోర్తాడ్ గ్రామస్తులు రూ.5లక్షల జరిమానా విధించారు. అధికార పార్టీ నాయకులు వేబిల్లుల పేరిట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. వెల్కటూర్ గ్రామంలో కూడా ట్రాక్టర్‌కు రూ.50 వేలు చెల్లిస్తున్నారు. బట్టాపూర్‌లో అమలుచేస్తున్న ఒప్పందాన్నే ఇక్కడ కూడా కొనసాగిస్తుండడం గమనార్హం.


వెల్కటూర్ శివారులోని పెద్దవాగులో జోరుగా ఇసుక తవ్వకాలు

# దివ్యాంగ విద్యార్థికి సదుపాయం కల్పించారు

## పరీక్షా హాలు వరకు బైక్‌పై వెళ్లేందుకు అనుమతి
## విద్యార్థి సీటు ఫస్ట్‌ఫ్లోర్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌కు మార్పు


దివ్యాంగ విద్యార్థిని పరీక్షా కేంద్రంలోకి బైక్‌పై తీసుకెళ్తున్న తండ్రి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బోధన్, మార్చి 22: పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. శుక్రవారం పరీక్ష ప్రారంభం రోజున వచ్చిన సయ్యద్ నయ్యర్ అహ్మద్ అనే దివ్యాంగ విద్యార్థి తీవ్ర అసౌకర్యానికి గురయ్యాడు. వీల్‌చైర్ లేకపోవడం, సదరు విద్యార్థికి ఫస్ట్‌ఫ్లోర్‌లో సీటు కేటాయించడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో సదరు విద్యార్థి కుటుంబీకుడొకరు అహ్మద్‌ను మెయిన్ గేట్ నుంచి ఫస్ట్‌ఫ్లోర్ వరకు ఎత్తుకొని వెళ్లాల్సి వచ్చింది. దివ్యాంగ విద్యార్థి ఎదుర్కొన్న ఇబ్బందులపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'దివ్యాంగ విద్యార్థులపై నిర్లక్ష్యం' శీర్షికన శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు శనివారం ఆ విద్యార్థికి వీల్‌చైర్ ఏర్పాటుచేయనప్పటికీ, స్కూటర్‌పై భవనం నుంచి గ్రౌండ్ ఫ్లోర్ వరకు అనుమతించారు. అంతేగాకుండా విద్యార్థి సీటును గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. మొదటి రోజున జరిగిన నిర్లక్ష్యంపై పరీక్షా కేంద్రం నిర్వాహకులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్న విషయమై ఆసక్తి నెలకొన్నది.

# హామీలు నెరవేర్చకపోతే.. కాంగ్రెస్‌ను గద్దె దించుతాం

- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధుల స్పష్టీకరణ
- రేపు 'చలో అసెంబ్లీ' విజయవంతం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న రైతు ఐక్య కార్యచరణ కమిటీ సభ్యుడు ఏలేటి నవీన్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్, మార్చి 22: రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోతే ఆ పార్టీని గద్దె దింపే వరకు బాధ్యత తీసుకుంటామని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పట్టణంలో రైతు ఐక్యకార్యాచరణ కమిటీ, జేఏసీ సభ్యులు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జేఏసీ సభ్యుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుత మార్గంలో ఆందోళన చేస్తున్న రైతు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి.. ప్రజలు, రైతులపై హామీల వర్షం కురిపించి, ఇప్పుడు రైతాంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ ఈ నెల 24న జగిత్యాల రైతుఐక్యవేదిక పిలుపునిచ్చిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పి, కేవలం 40శాతం మాత్రమే చేసిందని మండిపడ్డారు. అన్ని పంటలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం సన్నాలకే మాత్రమే ఇస్తామని చెప్పి కొంతమందికే ఇచ్చి చేతులు దులుపుకున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాకు పసుపు బోర్డు తెచ్చినా రూ.15 వేల మద్దతు ధర ఇప్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. సమావేశంలో రైతు జేఏసీ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి, వి.ప్రభాకర్, నక్కల భూమారెడ్డి, రమేశ్ రెడ్డి, దేవారాం తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ప్రాంగణంలో యువకుడి ఆత్మహత్యా యత్నం

- అడ్డుకున్న పోలీసులు, కోర్టు సిబ్బంది
- న్యూసెన్స్ కింద కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు
- సదరు యువకుడు ఇలా చేయడం మూడోసారని ఎస్‌హెచ్‌వో వెల్లడి

వినాయక్‌నగర్, మార్చి 22: నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఉదయం ఓ యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకోగా.. అక్కడే ఉన్న పోలీసులు, కోర్టు సిబ్బంది అడ్డుకొన్నారు. సదరు యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు యువకుడు మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని హమాల్‌వాడి ప్రాంతానికి చెందిన నర్సింహులు అనే యువకుడికి అతడి తమ్ముడు డబ్బులు ఇవ్వాల్సి ఉండగా చెక్కును రాసిచ్చాడు. చెక్కు కాకుండా డబ్బులు కావాలని అడిగితే ఇవ్వడం లేదని, ఈ విషయంలో మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తనకు కోర్టులోనే న్యాయం జరుగుతుందని ఇక్కడికి వచ్చి ఒంటిపై కిరోసిన్ పోసుకున్నట్లు నర్సింహులు తెలిపాడు. సదరు యువకుడిని పోలీసులు వన్‌టౌన్‌కు తరలించారు.

### ఇలా న్యూసెన్స్ చేయడం మూడోసారి

కోర్టు ప్రాంగణంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని న్యూసెన్స్ చేసిన నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఇప్పటి వరకు ఇలాగే రెండుసార్లు న్యూసెన్స్‌కు పాల్పడినట్లు తమ విచారణలో తేలినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో ఓ ప్లాట్ విషయంలో, మరోచోట ఓ రియల్ ఎస్టేట్ ఆఫీస్ ఎదుట కూడా పెట్రోల్ పోసుకొని వారిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశాడని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

–ఎస్‌హెచ్‌వో రఘుపతి